నేడే సిరిమానోత్సవం



సిద్ధమైన సిరిమాను రథం



విద్యుత్ వెలుగుల్లో అమ్మవారి ఆలయ ప్రాంగణం

- సిరిమానుపై అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తకోటి ఎదురుచూపు
- మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న ఊరేగింపు

పైడిమాంబ సిరిమానోత్సవానికి సమయం ఆసన్నమైంది. అమ్మవారి పండుగలో కీలక ఘట్టమైన సిరిమాను ఊరేగింపును తిలకించేందుకు భక్తకోటి ఇప్పటికే విజయనగరం చేరుకుంది. కొద్ది గంటల్లో వారి కోరిక నెరవేరనుంది. మరోవైపు పండుగ ఘడియల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. మొక్కులు చెల్లించుకుంటున్నారు. సిరిమానోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

విజయనగరం రూరల్/ కల్చరల్/ కలెక్టరేట్/ క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అంజలి రథం.. జాలరి వల..పాలధార.. తెల్ల ఏనుగు పరివారంతో పైడిమాంబ నడిచే దేవతగా భక్తులకు దర్శనమిచ్చే ఘట్టమే సిరిమానోత్సవం. ఏటా దసరా వెళ్లిన మరుసటి మంగళవారం నిర్వహించే ఈ వేడుకకు లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. పైడిమాంబ ప్రతి రూపంగా ఆలయ పూజారి 50 అడుగుల చెట్టు మాను చివరన కూర్చుని భక్తులను ఆశీర్వదించనున్నారు. మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి నుంచి కోట వరకూ మూడు పర్యాయాలు సిరిమాను తిరుగుతుంది. ఈ ప్రక్రియ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చీకటి పడకముందే సిరిమానోత్సవాన్ని ముగించాలని జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తించిన నేపథ్యంలో దశాబ్దకాలంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సంబంధిత శాఖ మంత్రి లేదా జిల్లాకు చెందిన మంత్రి పైడిమాంబకు పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు పైడిమాంబ ఆలయాన్ని దర్శించుకోనున్నారు.

భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు

పైడిమాంబ సిరిమానోత్సవంలో భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అధికారులకు (మిగతా 6వ పేజీలో..)

తొమ్మిదోసారి సిరిమాను అధిరోహణ



విజయనగరం కల్చరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఇలవేల్పు, కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ సిరిమానోత్సవం తిలకించడం ఓ అనుభూతి. అమ్మవారి ప్రతిరూపంగా సిరిమాను అధిరోహించే పూజారి బంటుపల్లి వెంకటరావు మంగళవారం తొమ్మిదో సారి సిరిమానుపై నుంచి భక్తులను ఆశీర్వదించనున్నారు. విజయనగరంలోని హుకుంపేటకు చెందిన ఈయన ఇప్పటి వరకూ 8సార్లు సిరిమాను అధిరోహించారు. అంతకుముందు ఆయన మేనమామ పతివాడ భాస్కరరావు ఎనిమిది సార్లు అధిరోహించారు. ఆయనకన్నా ముందు వెంకటరావు తండ్రి బంటుపల్లి బైరాగినాయుడు 27 సార్లు సిరిమానును అధిరోహించారు. పూర్వం నుంచి పతివాడ, బంటుపల్లి వారసులే సిరిమానుపై కూర్చోవడం ఆనవాయితీగా వస్తోంది. సిరిమాను అధిరోహించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని ఆలయ ప్రధాన పూజారి వెంకటరావు చెప్పారు. ఉత్సవానికి వచ్చే లక్షలాది మంది భక్తులు సిరిమానోత్సవాన్ని తిలకించి క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని, అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకుంటున్నట్టు ఆయన చెప్పారు.

సంప్రదాయబద్ధంగా తొలేళ్లు

- అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు
- కోలాహలంగా ఘటాల ఊరేగింపు



అమ్మవారికి చీర, సారె తీసుకెళ్తున్న గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు దంపతులు, ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్/కల్చరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జై పైడిమాంబ అంటూ భక్తుల నామస్మరణ ఒకవైపు.. పురోహితుల వేదమంత్రోచ్చారణ మరోవైపు.. డప్పులు, పులివేషాల సందడి ఇంకోవైపు నడుమ సోమవారం తొలేళ్ల సంబరం సంప్రదాయబద్ధంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. సోమవారం వేకువజామున మూడు గంటలకు సుప్రభాత సేవ అనంతరం పైడిమాంబ దర్శనానికి దేవదాయశాఖ భక్తులకు అనుమతిచ్చింది. ఉదయం 8 గంటల సమయంలో పూసపాటి వంశీయులు, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు సతీసమేతంగా వచ్చి పుట్టింటి కానుకగా చీర, సారె, పసుపు, కుంకుమ సమర్పించారు. అశోక్ కుమార్తె, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కూడా ఉన్నారు. తొలేళ్ల ఉత్సవంలో భాగంగా ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. (తొలియేరు.. తొలేళ్లుగా భక్తులు భావిస్తారు. సంవత్సరంలో మొట్టమొదటి విత్తనం అని అర్థం) సోమవారం (మిగతా 6వ పేజీలో..)



ఘటాలతో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న భక్తులు

సందడే సందడి



గీతాలాపనలో గీతామాధురి

- ఉర్రూతలూగించిన మెగా మ్యూజికల్ నైట్
- వర్షంలోనూ సంగీత ప్రియులతో కిక్కిరిసిన అయోధ్యమైదానం
- ముగిసిన విజయనగర ఉత్సవాలు



పాట పాడుతున్న రాహుల్ సిప్లిగంజ్

విజయనగరం/ టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మెగా మ్యూజికల్ నైట్ విజయనగరం ప్రజలను ఉర్రూతలూగించింది. యువత కేరింతలు కొట్టింది. అయోధ్యమైదానం ఈలలు, చప్పట్లతో మారుమోగింది. రెండురోజులుగా నిర్వహిస్తున్న విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నగరంలోని అయోధ్యమైదానంలో మెగా మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశారు. గీతా మాధురి, రాహుల్‌సిప్లిగంజ్, నోయాల్ పాడిన పాటలకు యువత, పెద్దలు తేడా లేకుండా సందడిచేస్తూ చిందేశారు. కార్యక్రమం చివరి వరకూ జోష్‌తో సాగింది. గీతామాధురి ఆలపించిన 'పక్కా లోకల్.. పక్కాలోకల్ పాటకు విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు, ఎమ్మెల్సీ గ్రీష్మ డ్యాన్సు చేయటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నోయల్, రాహుల్ సిప్లిగంజ్ ఇటు మెలోడీ, అటు హుషారైన పాటలను ఆలపించి కుర్రకారును కట్టిపడేశారు. నాట్‌నాట్ పాటకు ప్రాంగణం హోరెత్తిపోయింది. కొద్దిసేపు వర్షం పడినప్పటికీ తరువాత వాతావరణం అనుకూలించడంతో స్టేడియం సంగీత ప్రియులతో నిండిపోయింది. ఈ మ్యూజికల్ నైట్‌ను మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనువాస్, కందుల దుర్గేష్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ రామసుందర్ రెడ్డి, ఎస్పీ దామోదర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, జనసేన నాయకులు అవనాపు విక్రమ్ తదితరులు వీక్షించారు.

- విజయనగరం ఉత్సవాలు సోమవారంతో ముగిసాయి. నేటితరం యువతకు, భవిష్యత్ తరాలకు విజయనగరం వైభవం, సంస్కృతి తెలిసేలా కార్యక్రమాలు నిర్వహించారు.



విజయనగర ఉత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్, వేదికపై మరో మంత్రి శ్రీనివాస్

బొత్స హవాకు బ్రేక్!

- మూడు దశాబ్దాలకుపైగా డీసీసీబీపై పట్టు
- ఏ ప్రభుత్వం ఉన్నా తన మనుషులతోనే తతంగం
- ఏటా అమ్మవారి సిరిమాను వీక్షణ అక్కడి నుంచే
- ఈ ఏడాది అనుమతి తిరస్కరణ

ఎంతటి కాకలుతీరిన యోధుడు అయినా ఒక్కోసారి మట్టికరవడం సహజం. ఇప్పుడు అటువంటి పరిస్థితే మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎదురైంది. మూడు దశాబ్దాలుగా ఆయన జిల్లాలో హవా చాటుకుంటూ వస్తున్నారు. తనతో పాటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలు ఓడిపోయినా తన మాట చెల్లుబాటు చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు ఆ పరపతి తగ్గిందని అంతా చెప్పుకుంటున్నారు. ఈసారి ఆయన డీసీసీబీ కార్యాలయం వద్ద నుంచి సిరిమానోత్సవం చూసేందుకు అనుమతి ఇవ్వలేదు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాజకీయ పర్యటన నిషేధమంటూ డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అభ్యంతరం తెలిపారు.

విజయనగరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పెద్ద పండుగల్లో విజయనగరం పైడితల్లి అమ్మవారి పండుగ ఒకటి. దసరా తరువాత వచ్చే సోమ, మంగళవారాల్లో అమ్మవారి పండుగ జరుగుతుంటుంది. లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అయితే సిరిమానోత్సవాన్ని అశోక్‌గజపతిరాజు కుటుంబం కోట బురుజు పైనుంచి తిలకిస్తుంటారు. తూర్పువైపు ఉండే డీసీసీబీ కార్యాలయం మేడపై నుంచి బొత్స కుటుంబీకులు వీక్షిస్తుంటారు. ఇది చాలా ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ. ఈఏడాది డీసీసీబీ కార్యాలయంపై వైసీపీ నేతలకు అవకాశం లేదని డీసీసీబీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున తేల్చి చెప్పారు. ఇటీవల బొత్స సత్యనారాయణ నుంచి డీసీసీబీ (మిగతా 6వ పేజీలో..)

పోలీసులపై దాడి

- రాళ్లు, చెప్పులు విసిరిన వైనం
- 25 మందిపై కేసు నమోదు
- జమ్ము గ్రామంలో ఆదివారం రాత్రి ఘటన



కాలువలోకి నెట్టేసిన పోలీస్ వాహనం,(ఇన్‌సెట్‌లో)ధ్వంసమైన అద్దం

గుర్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గుర్ల మండలంలోని జమ్ము గ్రామంలో ఆదివారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొందరు స్థానికులు పోలీసులను భయపెట్టారు. రాళ్లు, చెప్పులు విసురుతూ మూకుమ్మడిగా దాడికి దిగారు. దీంతో పోలీసులు ఏం చేయలేక సీఆర్‌పీఎఫ్ ఫోర్స్‌కు సమాచారం ఇచ్చారు. నిమిషాల్లో పోలీసులను రక్షించేందుకు ప్రత్యేక దళాలు రంగప్రవేశం చేశాయి. వివరాల్లోకి వెళితే.. దేవి నిమజ్జనం సందర్భంగా జమ్ముగ్రామంలో శనివారం రాత్రి గొడవ జరిగింది. ఈ విషయం తెలిసి గ్రామానికి చేరుకున్న పోలీసుల పట్ల స్థానికులు కొందరు దురుసుగా ప్రవర్తించారు. దాడికి ప్రయత్నించారు. నిందితులను గుర్తించిన పోలీసులు విచారించేందుకు ఆదివారం రాత్రి మరోసారి గ్రామానికి వెళ్లగా మళ్లీ దాడి చేశారు. సర్పంచ్ నరసింహమూర్తి ఇంటికి వెళ్లిన పోలీసులు నిందితులను రమ్మని కోరారు. అంతలో మహిళలు, కొంతమంది యువకులు కర్రలు, రాళ్లతో దాడికి దిగారు. పోలీస్ వాహనాలను రాళ్లతో కొట్టారు. దీంతో కానిస్టేబుళ్లతో పాటు సీఐకు దెబ్బలు తగిలాయి. పరిస్థితి అదుపు తప్పడంతో వారు సీఆర్‌పీఎఫ్ బలగాలకు సమాచారం ఇచ్చారు. నిమిషాల్లో అక్కడికి చేరుకున్న దళాలు 25 మందిని గుర్తించి వారిని స్టేషన్‌కు తరలించాయి. వారందరిపై ఎస్‌ఐ నారాయణరావు కేసు నమోదు చేశారు.

ఎంతటివారైనా ఉపేక్షించం: ఎస్పీ

శాంతిభద్రతల పరిరక్షణలో ఉండే పోలీసు విధులను, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ ఏఆర్ దామోదర్ (మిగతా 6వ పేజీలో..)

షెడ్యూల్ ప్రకారం సూపర్ జీఎస్టీ కార్యక్రమాలు జరగాలి : కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

5 లో

రాష్ట్ర స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్నబొబ్బిలి చైర్మన్, కమిషనర్



అవార్డు అందుకుంటున్న లక్ష్మణరావు

బొబ్బిలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికైన బొబ్బిలి మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయానికి సీఎం చంద్రబాబు సోమవారం అవార్డులను బహూకరించారు. విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బొబ్బిలికి సంబంధించి మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనర్ లాలం రామలక్ష్మి అవార్డును అందుకున్నారు. విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయానికి సంబంధించి జిల్లా అధికారి లక్ష్మణరావు అవార్డును అందుకున్నారు.

విజయనగరం ప్లాస్టిక్ రహితంగా మారాలి

- పారిశుధ్య కార్మికుల సేవలు అపూర్వం
- మంత్రి అనిత

6 లో



సిరిమానుకు ప్రత్యేక పూజలు

- హుకుంపేటలో భక్తజనం సందడి



హుకుంపేటలో సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు

విజయనగరం కల్చరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవాల నేపథ్యంలో సోమవారం తోలేళ్ల రోజున హుకుంపేటలోని సిరిమాను దర్శనానికి భక్తజనం పోటెత్తారు. ఓ పక్క సిరిమాను తీర్చిదిద్దే పనులు చేస్తుండగానే... మరోవైపు భక్తులు పూజలు చేశారు. సోమవారం ఉదయం నుంచి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. టూటౌన్ సీఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది సిరిమాను, రథాల ప్రాంతంలో బందోబస్తు నిర్వహిస్తు న్నారు. మంగళవారం ఉదయం 10 గంటల తరువాత పూజలను నిలిపివేసి.. సిరిమానును తరలించేందుకు పోలీసులు సమాయత్తం అవుతున్నారు. ఆ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలను కూడా అనుమతించవద్దని ఆదేశించారు. 11 గంటలలోపు సిరిమానును హుకుంపేట నుంచి ఉల్లివీధి మీదుగా కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం, మెయిన్‌రోడ్డు మీదుగా అమ్మవారి చదురుగుడి వరకూ తీసుకువస్తారు. సిరిమాను తరలింపులో తీసుకోవలసిన జాగ్రత్తలు, హుకుంపేటలో బందోబస్తు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై టూటౌన్ సీఐ శ్రీనివాసరావు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. పూజారి బంటుపల్లి వెంకటరావు నివాసం వద్ద సిద్ధమవుతున్న సిరిమాను తిరిగే రథం, ఇతర రథాలను పోలీసులు పరిశీలించారు.



సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు



అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు ఉత్సవాలను తిలకించేందుకు ఏర్పాట్లు చేసిన దృశ్యం

సామాన్యులకు ఇబ్బంది లేకుండా చూడండి

- దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష



క్యూలైనును పరిశీలిస్తున్న సహాయ కమిషనర్ శిరీష

విజయనగరం కల్చరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీష అధికారులకు సూచించారు. సోమవారం ఆమె చదురుగుడి వద్ద క్యూలైన్లతో పాటు వీఐపీ, ఇతర గేట్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఇష్టానుసారం దర్శనాలకు అనుమతి' అనే శీర్షికన ప్రచురించిన కథనంపై ఆమె స్పందించారు. అనధికారికంగా ఎవరినీ, వీఐపీ, ఇతర గేట్లలో అనుమతించవద్దన్నారు. అందరినీ క్యూ లైన్లలోనే దర్శనానికి అనుమతించాలని స్పష్టం చేశారు. ఆలయం ఎదురుగా ఉన్న వీఐపీ గేటు వద్ద తహసీల్దార్‌ను నియమించారు. ప్రోటోకాల్‌లో ఉన్న వ్యక్తులను మాత్రమే ఈ మార్గంలో అనుమతించాలని చెప్పారు. భక్తులకు తాగునీరు సదుపాయం కల్పించాలని సూచించారు. ఆలయం వెనుక భాగం నుంచి ఎవరినీ అనుమతించవద్దని సిబ్బందికి సూచించారు.

సిరిమానోత్సవం వీక్షణకు వేదికలు సిద్ధం



ఘటాలతో వస్తున్న మహిళలు

విజయనగరం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పైడితల్లి సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు అతిథుల కోసం యంత్రాంగం నిన్నటి వరకూ రెండు వేదికలనే సిద్ధం చేసేది. ఈ ఏడాది మూడు వేదికలు సిద్ధమవుతున్నాయి. గతంలో కోటబురుజుపై నుంచి ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులతో పాటు, టీడీపీ శ్రేణులు అంతా సిరిమాను సంబరాన్ని తిలకించేవారు. డీసీసీబీ వద్ద ఏర్పాటు చేసే వేదికపై నుంచి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు పలువురు నేతలు వీక్షించేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత డీసీసీబీ చైర్మన్ పగ్గాలను పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జునకు అప్పగించారు. దీంతో ఆయన డీసీసీబీ వేదిక నుంచే సిరిమానును వీక్షిస్తానని అధికారులను కోరారు. తనతో పాటు డీసీఎంఎస్ చైర్మన్ గొంపా కృష్ణ, ఉమ్మడి విజయనగరం జిల్లా పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు అంతా ఈ వేదికపైన ఉంటారని ఆయన చెప్పారు. డీసీసీబీకి సమీపంలోనే కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వద్ద బొత్స సత్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు, ఆ పార్టీ నాయకులకు అధికారులు వేదికను ఏర్పాటు చేస్తున్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు



విజయనగరం రూరల్, అక్టోబరు 6(ఆంధ్ర జ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవ కార్యక్రమంలో భాగంగా తొలిరోజు సోమవారం జరిగిన తొలేళ్ల ఉత్సవంలో ప్రదర్శించిన విచిత్ర వేషధారణలు అలరించాయి. అమ్మవారి పండుగ అంటే పులివేషాలదే అగ్రస్థానం. ఈ నేపథ్యంలో 20 ఏళ్లుగా కోట వద్ద పులివేషాల పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా పులివేషాల పోటీలు ఆసక్తిగా మారాయి. లంకవీధి, జొన్నగుడ్డి, లంకాపట్టణం, కొత్తపేట, హుకుంపేట, ఇప్పిలివీధి, గాజులరేగ, రంగిరీజు వీధితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పులివేషధారులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మరోవైపు పైడిమాంబకు మొక్కు బడులు తీర్చుకునేందుకు రామాయణం, భారతం, భాగవతంలోని శ్రీకృష్ణుడు, అర్జునుడు, అంజనేయ స్వామి, రాముడు, సీత, లక్ష్మణుడు తదితర వేషాల్లో భక్తులు ఆకట్టుకున్నారు.





కృష్ణార్జునులు, హనుమంతుడి వేషధారణల్లో చిన్నారులు



కోట సెంటర్‌లో జన సందోహం



సీసీ పుటేజీలు పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్



అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు





భువన విజయంలోని ఓ సన్నివేశం

ఉత్సాహంగా..

- ముగిసిన విజయనగర ఉత్సవాలు
- అలరించిన అష్టావధానం
- ఉల్లాసంగా క్రీడా పోటీలు



విజయనగరం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విజయనగర ఉత్సవాలలో భాగంగా చివరి రోజు సోమవారం స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన అష్టావధానం సాహితీప్రియులను ఆద్యంతం అలరించింది. శతావధాని రంపవెంకట అనిల్ కుమార్ చేసిన అష్టావధానం మంత్రముగ్ధుల్ని చేసింది. సంచాలకులుగా జక్కు రామకృష్ణ వ్యవహరించగా వర్ణన మానాప్రగడ సాహితి, దత్తపదిని శిరీషా రఘురాం, వ్యస్తాక్షరి లగుడు వరలక్ష్మి, ఆశువు భోగరాజు బాలాజీ, నిషిద్ధాక్షరి సరిపల్లి సోమేశ్వరరావు, పురాణ పఠనం దశగ్రంథాల వెంకటసుబ్రహ్మణ్యంలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనార్దననాయుడు అధ్యక్షత వహించారు. అనంతరం సాహితీవేత్తలను నిర్వాహకులు సత్కరించారు.



భువన విజయంతో...

నెల్లిమర్ల డైట్ కళాశాల చిన్నారులతో లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన భువనవిజయం నాటకం ప్రేక్షకులను కట్టిపడేసింది. మహామంత్రి తిమ్మరుసుగా అరుణ, అల్లసాని పెద్దనగా పల్లవి, తెనాలి రామకృష్ణగా నీలిమ, నంది తిమ్మనగా యశస్విని, దూర్జటిగా గిరిజ, రామరాజ భూషనుడిగా చిన్నాలమ్మ నటించారు.

ముగిసిన క్రీడా పోటీలు

గత రెండు రోజులుగా విజ్జీ మైదానంలో జరుగుతున్న క్రీడాపోటీలు సోమవారంతో ముగిశాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, స్కేటింగ్ తదితర క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

జానపదాలతో...

విజయనగరం ఉత్సవాలలో భాగంగా గత రెండురోజులుగా లయన్స్ కమ్యూనిటీ హాలులో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. థింసా, కర్రసాము, పులివేషాలు, కోలాటంతో పాటు వివిధ జానపద గీతాలకు నృత్యాలను ప్రదర్శించారు. వీటిని ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



షణ్ముఖప్రియ గాత్ర కచేరీ

విజయనగరం రూరల్/ రింగురోడ్డు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా మహారాజా సంగీత కళాశాలలో నిర్వ హించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 36 బృందాలు పాల్గొన్నాయి. 300 మంది కళాకారులు వారి ప్రతిభను చాటారు. నాదస్వరం, గాత్రం, వీణ, ఫ్లూట్, వయోలిన్, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించారు. తమ్మిన షణ్ముఖ ప్రియ గాత్రకచేరీ, కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించిన పద్య నాటక ఏకాపాత్రాభినయ ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. పసగాడ సింహాచలం, ఎం .ఆదెయ్య, నైదాన సూరిబాబు తదితరులు హరిశ్చంద్ర, సుబ్బిశెట్టి, గిరీశం పంతులు తదితర పాత్రలను ప్రదర్శించారు. బొంకులదిబ్బ వద్ద నాటక ప్రదర్శన, కోటలో సైన్సు ఎగ్జిబిషన్‌ని ఏర్పాటు చేశారు.



అమ్మవారి అవతారాలుగా..

రాజాం మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరావు

రాజాం/ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపల్ మేనేజరు కె.శ్రీనివాసరావుకు కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ జె.రామప్పలనాయుడును తెనాలి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఉదయం ఉత్తర్వులు వచ్చిన వెంటనే ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు టీపీవో శాస్త్రి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్, ఏఈ వెంకటరామరాజు, మెప్మా టీఎంసీ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

గోవా గవర్నర్‌ను కలిసిన మంత్రి అచ్చెన్నాయుడు



విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం రాత్రి కలిశారు. విజయనగరంలోని అశోక్ గజపతిరాజు నివాసంలో మంత్రి ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించి అభినందనలు తెలిపారు.

కొత్తవలసలో నిలిచిన రాకపోకలు

కొత్తవలస, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొత్తవలస జంక్షన్‌లోనున్న రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా నీటితో నిండిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తవలస-కె.కోటపాడు రోడ్డు, కొత్తవలస-సబ్బవరం రోడ్డులో నివాసం ఉంటున్న ప్రజలు కొత్తవలస జంక్షన్‌కు రాలేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు గాడి అప్పారావు, గొంప కృష్ణమూర్తి సోమవారం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఆందోళన చేశారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్యూ లైన్లో పాలు, బిస్కెట్ల పంపిణీ

విజయనగరం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తొలేళ్ల రోజైన సోమవారం పైడిమాంబ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వృద్ధులు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులకు దేవదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తాగునీటితో పాటు, చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు అందజేశారు. షామియానాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో కె.శిరీషా సోమవారం వీటిని ప్రారంభించారు.

రాజాంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలి

రాజాం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాజాం ప్రాంత కార్మికుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాజాంలో ఈఎస్ఐ డిస్పెన్సరీని ప్రైవేటు ఆసుపత్రికి టైఅప్ చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులతో కలిసి ఇక్కడి నాలుగు రోడ్ల జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు.

విశాఖకు విద్యుత్ ఉద్యోగులు

జామి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జామి నుంచి విద్యుత్ శాఖ ఉద్యోగులు చలో విశాఖ మహాధర్నా కార్యక్రమానికి సోమవారం బయలుదేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదన్నారు.

రైతుబజారుకు స్థలం కేటాయించండి

కొత్తవలస, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో రైతుబజారు ఏర్పాటుకు స్థానిక సంతమార్కెట్‌లో స్థలం కేటాయించాలని కోరుతూ కొత్తవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, కార్యదర్శి విజయబాబు.. ఎంపీడీవో పి.రమణయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సంత మార్కెట్ స్థలం జిల్లా పరిషత్ ఆధీనంలో ఉన్నందున జడ్పీ సీఈవోను కలిసి వినతిపత్రం ఇస్తామని చెప్పారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కొత్తవలస, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. వివిధ శాఖల వారిగా ఉన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కొత్తవలస పీహెచ్‌సీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని వైద్యాధికారి సీతల్ వర్మ కోరారు. ఎంఈవో శ్రీదేవి మాట్లాడుతూ మండలానికి ఉపాధ్యాయుల కొరత లేనందున కొత్త ఉపాధ్యాయులు రావడం లేదని తెలిపారు. ఎంపీడీవో రమణయ్య, జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, వైస్ ఎంపీపీ సరస్వతి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కళ్యాణి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్యులు, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న ప్రముఖులు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని సోమవారం రాత్రి పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర హోం శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలి

ఈసందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలు అందరిపై ఉండాలని కోరారు. సీఎం చంద్రబాబు ప్రతిపాదించిన ప్రాజెక్టులు, పథకాలు సత్ఫలితాలు ఇవ్వాలని, అమరావతి నిర్మాణం పూర్తి కావాలని ఆకాంక్షించారు. దీనికి ముందు కలెక్టర్ రామసుందర్‌రెడ్డి.. మంత్రులు అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్‌లను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.



మంత్రి అచ్చెన్నను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రులు దుర్గేష్, అనిత, శ్రీనివాస్

జీఎస్టీ తగ్గింపుతో పారిశ్రామికవేత్తలకు సువర్ణావకాశం

● మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గిన నేపథ్యంలో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు పారిశ్రామికవేత్తలకు ఇదే మంచి అవకాశమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గతంలో ఒక్కో రాష్ట్రంలో ఒక రకంగా జీఎస్టీ ఉండడంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చేందుకు సుముఖత చూపేవారు కాదన్నారు. నేడు ప్రధాని నరేంద్రమోదీ ఒకే రాష్ట్రం ఒకే జీఎస్టీ సంస్కరణలు తీసుకురావడం శుభపరిణామం అన్నారు. జీఎస్టీ వల్ల వచ్చే టాక్స్‌ల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి సుమారు రూ.2లక్షల కోట్లు ఆదాయం కోల్పోగా మన రాష్ట్రానికి రూ.8వేల కోట్ల ఆదాయం కోల్పోతున్నామని చెప్పారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో సామాన్య ప్రజలకు అతితక్కువ ధరకు అన్నిరకాల వస్తువులు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. అనంతరం ట్రాక్టర్లతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీ, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్

వ్యవసాయ రంగానికి మేలు

నెల్లిమర్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నూతన జీఎస్టీ విధానం వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తుందని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బంగార్రాజు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏవో శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. వ్యవసాయ రంగంలో జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతం వరకు తగ్గించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గేదెల గాయత్రి, టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ భారతి, చీపురుపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.కోటేశ్వరరావు, ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, తహసీల్దార్ కె.శ్రీకాంత్, డీటీ వీవీఆర్.జగన్నాథరావు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు

సమావేశాలు.. ర్యాలీలు

రాజాం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలతో జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి శివ్వాల తవిటినాయుడు జీఎస్టీ 2.0పై సమావేశం నిర్వహించారు. ప్రతి కళాశాలలో జీఎస్టీ 2.0పై ఒక అవగాహన సదస్సులు, ర్యాలీలు వివిధ పోటీలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన్ని ప్రిన్సిపాల్స్, సిబ్బంది సన్మానించారు.

● భోగాపురం: భోగాపురం గ్రామంలో సోమవారం జీఎస్టీ తగ్గింపుపై అధికారులు, సిబ్బంది భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. నూతన జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించారు.

సూపర్ జీఎస్టీ కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం జరగాలి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం జరగాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. ఏరోజుకారోజు లక్ష్యాలు పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ జీఎస్టీపై పరిశ్రమల శాఖ ద్వారా ఎంఎస్ఎంఈలలో ఎగ్జిబిషన్లు నిర్వహించాలని.. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో జీఎస్టీపై అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు పోటీలు కూడా నిర్వహించాలని చెప్పారు. వ్యవసాయ పరికరాలు, రైతు సేవా కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని, అన్ని కార్యక్రమాలను గ్రామ స్థాయిలో సెక్రటరీలు అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. లక్ష్యాలు చేరుకోలేని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి పెట్టాలని, ఎక్కడైనా ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవన్నారు. యూరియా సరఫరాలో మండల స్థాయి కమిటీ సమన్వయంగా పనిచేయాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలన్నారు.

రాజాం సామాజిక ఆసుపత్రికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు



హోం మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న హరిబాబు

రాజాం/ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాజాం సామాజిక ఆసుపత్రి(100 పడకలు) స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపికైంది. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత చేతులమీదుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కరణం హరిబాబు అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. డా.హరిబాబు సూపరింటెండెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నుంచి ఆసుపత్రిలో టాయిలెట్స్, వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ, రక్షిత తాగు నీరు, రోగులకు రుచికరమైన ఆహారం అందించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలనిచ్చాయి.

బాధ్యత పెంచింది..

ఆసుపత్రికి అవార్డు రావడంతో బాధ్యతను మరింత పెంచింది. ఆసుపత్రి నిర్వహణ సజావుగా సాగేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది అందరూ సహకరిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులపై కొంతమందికి ఉన్న అపోహను తొలగించేందుకు ప్రయత్నిస్తాను.

- డా.కరణం హరిబాబు, సూపరింటెండెంట్, రాజాం సామాజిక ఆసుపత్రి

పూసపాటిరేగ పీహెచ్‌సీకి..

పూసపాటిరేగ, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాదికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు ప్రకటించింది. ఇందులో పూసపాటిరేగ పీహెచ్‌సీకి జిల్లా స్థాయి అవార్డు లభించింది. ఈ అవార్డును సోమవారం జిల్లా కేంద్రంలో మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ చేతులమీదుగా పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రమీలా దేవి, డాక్టర్ కృష్ణచైతన్యలు అందుకున్నారు.

నందిగాం పంచాయతీకి..

భోగాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నందిగాం పంచాయతీకి అవార్డు లభించింది. ఈ అవార్డును సోమవారం జిల్లా కేంద్రంలో మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు చేతులమీదుగా సర్పంచ్ జి.మురళీమోహన్, కార్యదర్శి షకీరనజ్మ అందుకున్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలి

శృంగవరపుకోట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్‌లు పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పోతనాపల్లిలో సోమవారం నిర్వహించిన ఎస్.కోట పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఛైర్‌పర్సన్‌గా గొర్రిపాటి సింహాచలంనాయుడు, సభ్యులుగా గేదెల శ్రీనివాసరావు, వబ్బిన జగదీశ్వరీలతో ప్రమాణం చేయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ నాయకులను, కార్యకర్తలను స్థానిక ఎన్నికలకు సమాయత్తం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్నలకు సూచించారు. రాష్ట్ర దాసరి సంక్షేమ సంఘం ఛైర్మన్ రత్నాజీ, ఎల్.కోట మాజీ జడ్పీటీసీ కె.ఈశ్వరరావు, కొత్తవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చొక్కాకుల మల్లునాయుడు, తూర్పాటి ఆదిబాబు, కోళ్ల శ్రీను, గనివాడ ఎర్నియుడు, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లలితకుమారి దంపతులు

బాధితులకు సీఎంఆర్ఎఫ్ అందజేత

లక్కవరపుకోట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వివిధ మండలాలకు చెందిన పలువురికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం ఎల్.కోటలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. బాధితులకు సుమారు రూ.2.50 లక్షల చెక్కులను అందజేశారు. మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, రమేష్‌నాయుడు, చల్లా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ● గుర్ల: నిరుపేదలను టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన పలువు రికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశా రు. చుక్కపేట, అచ్యుతాపురం, గొలగము, సదానందపురం గ్రామాలకు చెందిన కుటుంబా లకు సుమారు రూ.6లక్షల విలువైన చెక్కులను అందజేశారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్.మహేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారి సూర్యనారాయణ పాల్గొన్నారు.



గుర్ల: చెక్కులను అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు

పైడితల్లి చిత్రపటంతో జిందాల్ నిర్వాసితుల నిరసన



పైడితల్లి చిత్రపటంతో రిలే దీక్ష చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితులు సోమవారం పైడితల్లి అమ్మవారి చిత్రపటంతో రిలే దీక్షలో పాల్గొన్నారు. బొడ్డవర గ్రామంలో వీరు గత 108రోజులుగా శాంతి యుత పోరాటం చేస్తున్నారు. జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జరజాపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన జ్యామెట్రీ పార్క్ ప్రాజెక్టు గణిత విభాగంలో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైంది. అతిథుల చేతులమీదుగా వీరు సోమవారం ప్రశంసా పత్రాలు, అవార్డులు అందుకున్నారు. ప్రాజెక్టు ప్రదర్శించిన విద్యార్థులను, గణిత ఉపాధ్యాయుడు బంగారయ్యను హెచ్ఎం కామేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

● భోగాపురం: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వైజ్ఞానిక, సాంస్కృతిక పోటీల్లో ముంజేరు హైస్కూల్ విద్యార్థులు పలు బహుమతులు గెలుచుకున్నారు. జిల్లా స్థాయి పద్య పఠన పోటీలో ఎస్.చేతనకు తృతీయ బహుమతి, గురజాడ అప్పారావు వేషధారణలో పి.రాంబాబుకు ప్రత్యేక బహుమతి, విచిత్ర వేషధారణలో ఎం.సురేంద్ర, బి.దుర్గారావు ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నారు.





నెల్లిమర్ల / భోగాపురం: ప్రశంసా పత్రాలు, అవార్డులు అందుకుంటున్న జరజాపుపేట, ముంజేరు విద్యార్థులు

డ్రోన్ ప్రదర్శించిన రెల్లివలస విద్యార్థులు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సైన్సు ఎగ్జిబిషన్‌లో జిల్లాలోని పూసపాటిరేగ మండలం రెల్లివలస జడ్పీ హైస్కూల్ విద్యార్థులు డ్రోన్ తయారు చేసి ప్రదర్శించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు.. ఈ డ్రోన్‌ను పరిశీలించి, తయారుచేసే విధానాన్ని అడిగి, విద్యార్థులను అభినందించారు. పాఠశాల హెచ్ఎం బలివాడ శంకరరావు, గ్రైడ్ టీచర్ అమరనాథ్, కొండపల్లి నూకాల నాయుడులను అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

సంతకవిటి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన వీధికి చెందిన మెంటి దేవి(27) అనే వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుందని హెడ్‌కానిస్టేబుల్ వి.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి మండలం పెద్దపుర్లి గ్రామానికి చెందిన దేవి మండల కేంద్రానికి చెందిన మెంటి మహేష్‌ను ఆరేళ్ల కిందట పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత నెల 28న భర్త మహేష్ మద్యం తాగి వచ్చాడు. భర్తను బెదిరించే ఉద్దేశంతో ఆమె పురుగుమందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు రాజాంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతిచెందింది. తండ్రి గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ విస్తరణ పనులు చేపడతాం

విజయనగరం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయ విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని మాన్సాస్ ఛైర్మన్, పైడిమాంబ ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు చెప్పారు. తొలేళ్ల ఉత్సవంలో భాగంగా పైడిమాంబకు ఆయన పట్టు వస్త్రాలను సమర్పించారు. చీర, సారెతో పాటు పలు రకాల వస్తువులను ఆమెకు సమర్పించారు. ఆయన వెంట సతీమణి సునీలా గజపతిరాజు, కుమార్తె, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఉన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, దేవస్థానం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. వివిధ కారణాలతో విస్తరణ పనులు వాయిదా పడుతూ వచ్చాయని, ఈ పండుగ పూర్తయిన వెంటనే చేపడతామని తెలిపారు.

త్వరలో సారవ గెడ్డ పనులు

దత్తిరాజేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): త్వరలో సారవ గెడ్డ పనులు ప్రారంభం కానున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా దత్తిరాజేరు మండలం దత్తి గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు సారవగెడ్డ మినీ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు ఆమోదం తెలిపారన్నారు. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేయాలంటూ అధికారులను సీఎం ఆదేశించారని తెలిపారు. రూ.27.5 కోట్లతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుతో రైతుల కష్టాలు తీరుతాయని మంత్రి తెలిపారు. జిల్లా కేంద్రంగా ఉపాధి కల్పన కోసం కొత్త ప్రాజెక్టులు ప్రకటిస్తారని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

నా చరిత్ర చెబితే అభ్యంతరం లేదు

● డీసీసీబీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

విజయనగరం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ నా చరిత్ర చెబుతానంటూ మాట్లాడుతున్నారని, నాకేం అభ్యంతరం లేదని డీసీసీబీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున బదులిచ్చారు. సోమవారం స్థానిక డీసీసీబీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బొత్స సత్యనారాయణ అల్లుడు, కొడుకు, అదేవిధంగా ప్రస్తుత వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావులతో మాట్లాడి, ఆ తర్వాత తన చరిత్ర చెబితే బాగుంటుందని నాగార్జున సూచించారు. 30 ఏళ్ల కాలంగా తమ కుటుంబం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో రాజకీయం చేసిందని, తమ కుటుంబంపై రెండు జిల్లాల్లో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. దశాబ్ద కాలానికి పైగా రాజకీయాల్లో ఉన్నాని, విలువలతో కూడిన రాజకీయాలు చేశానన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. సిరిమాను వీక్షణకు తాను ఎవరి అనుమతి కోరలేదని, పీఏ మాత్రం షెడ్యూల్ విడుదల చేశారని చెప్పారన్నారు. సిరిమాను వీక్షణకు సంబంధించి డీసీసీబీలో ఏర్పాటు చేసే వేదికపై తాను, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంపా కృష్ణతో పాటు, పీఏసీఎస్ అధ్యక్షులు అక్కడ నుంచి సిరిమానును వీక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు.

నిలిచిన భారీ వాహనం



మట్టిలో కూరుకుపోయిన వాహనం

భోగాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు ఏర్పాటులో భాగంగా అమటాం రాయవలస సమీప జాతీయ రహదారికి అడ్డంగా ఏర్పాటుచేసిన వంతెన కారణంగా భారీ వాహనం నిలిచిపోయింది. షిప్‌లో వచ్చిన భారీ మిషనరీని షిప్‌యార్డ్ నుంచి ఒడిశాకు తరలించే విధంగా 90 చక్రాల భారీ వాహనాన్ని విశాఖ వైపు నుంచి ఒడిశా వైపు జాతీయ రహదారిపై తరలిస్తున్నారు. అమటాం రాయవలస సమీప జాతీయ రహదారిపైకి వచ్చేసరికి వంతెన తగిలింది. దీంతో ఆ వాహనాన్ని పక్క నుంచి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా వంతెన పక్కన ఉన్న మట్టిలో చక్రాలు కూరుకుపోయాయి. దీంతో భారీ వాహనం కదలకుండా ఉండిపోయింది. అయితే దీనిని కదిలించే విధంగా లారీ సిబ్బంది పక్కనుంచి తాత్కాలిక గ్రావెల్ రహదారి ఏర్పాటు చేస్తున్నారు.

బాల్య వివాహం నిలిపివేత

భోగాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాజాపులోవ గ్రామంలో నిర్వహించనున్న ఓ బాల్య వివాహాన్ని సోమవారం అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో పదో తరగతి చదువుతున్న బాలికకు వివాహం చేసేందుకు ఇరు కుటుంబాలు సిద్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న సీడీపీవో లావణ్య, సూపర్‌వైజర్ సత్యవాణి, చైల్డ్ లైన్ సిబ్బంది గౌరి, కార్యదర్శి సంతోష్ కుమార్, ఎంఎస్‌కే పార్వతి, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, తదితరులు.. బాలిక ఇంటికి వెళ్లి కుటుంబీకులకు అవగాహన కల్పించి, వివాహాన్ని నిలుపుదల చేశారు.

అరెస్టు చేస్తే ఏంచేశారు?

ఎస్.కోట రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పెదఖండేపల్లిలో కొద్దిరోజుల కిందట తనను రాజ్యాంగ విరుద్ధంగా పోలీసులు అరెస్టు చేస్తే ప్రజాప్రతినిధులు ఇంతవరకు ఏంచేశారని సర్పంచ్ యాళ్ల రమణ ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఇక్కడ సమస్యలను పార్టీ దృష్టిలో పెడతామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు స్పందిస్తూ ఇక్కడ సర్పంచ్ అరెస్టును ఎందుకు అడ్డుకోలేకపోకపోయారని ప్రశ్నించారు. సభలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ జిందాల్ తమ నుంచి సేకరించిన భూములు వెనక్కి ఇవ్వాలని కోరారు.

నేడే సిరిమానోత్సవం

(మూడో పేజీ తరువాయి)

ఆదేశించారు. కోట, పైడిమాంబ ఆలయ వెనుక ప్రాంతం, అంబటి సత్తర్వు కూడలిని సోమవారం ఆయన పరిశీలించారు. బారికేడ్‌ల ఎత్తును, వాటి పటిష్టతను పరిశీలించారు. మంగళవారం సిరిమానోత్సవ సమయంలో ప్రజలంతా అమ్మవారిని సులువుగా దర్శనం చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. ఉదయం 10.30 గంటలకు సిరిమాను రథం హుకుంపేటలో బయలుదేరి అమ్మవారి ఆలయానికి చేరుకోవాలని, అక్కడ రథం ఏర్పాట్లు పూర్తి చేసి 3 గంటలకు సిరిమాను ఊరేగింపు ప్రారంభించేలా చూడాలని సూచించారు. ఆయన వెంట ఎస్పీ దామోదర్, ఏఎస్పీలు సౌమ్యలత, సహాభాజ్ అహ్మద్, పైడిమాంబ దేవస్థానం ఈవో కె.శిరీష, ఆర్‌డీవో దాట్ల కీర్తి తదితరులు ఉన్నారు.

ఉత్సవానికి పటిష్ఠ భద్రత: ఎస్పీ ఏఆర్ దామోదర్

పైడిమాంబ పండుగకు వచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా భద్రత కల్పిస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. ఆలయ పరిసరాలను సోమవారం ఉదయం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పండుగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 120 సీసీ కెమెరాలు, 12 డ్రోన్‌లతో నిఘా పెట్టామన్నారు. డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేపట్టామన్నారు. కమాండ్ కంట్రోల్ రూంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

సంప్రదాయబద్ధంగా తొలేళ్లు

(మూడో పేజీ తరువాయి)

రాత్రి 12 గంటల సమయంలో చదురుగుడి వద్ద ఈ తంతు జరిగింది. అంతక ముందు హుకుంపేట నుంచి ఘటాలను చదురుగుడికి తీసుకువచ్చారు. మేళతాళాలు, పులివేషాలు, ఇతర నేల వేషాలు నడుమ ఘటాలను చదురుగుడి నుంచి కోటలో వున్న కోట శక్తి వరకూ తీసుకువచ్చారు. అక్కడ పూజలు అనంతరం మళ్లీ చదురుగుడికి ఎదురుగా ఘటాలను ఉంచారు. రాత్రి 12 గంటలు దాటిన తరువాత భక్తులు అధిక సంఖ్యలో ఘటాలకు పూజలు చేశారు.

● పైడిమాంబను తొలేళ్ల ఉత్సవానికి సిద్ధం చేసే క్రమంలో ఆదివారం రాత్రి 10.45 గంటలకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి వివిధ నదీజలాలతో అభిషేకించారు. ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది, పైడిమాంబ భక్తుల సమక్షంలో ఈ తంతు జరిగింది. అనంతరం తొలేళ్ల ఉత్సవానికి పైడిమాంబను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

బొత్స హవాకు బ్రేక్

(మూడో పేజీ తరువాయి)

కార్యాలయ అధికారులకు ఒక లేఖ అందింది. అమ్మవారి సిరిమానోత్సవాన్ని డీసీసీబీ కార్యాలయం నుంచి తనతో పాటు వైసీపీ నేతలు తిలకిస్తారని.. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని ఆ లేఖ సారాంశం. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ శాసనమండలిలో వైసీపీ పక్ష నేత. ఇది కేబినెట్ హోదాతో కూడుకున్న పదవి. ఆ కారణంతోనే డీసీసీబీ అధికారులకు లేఖ రాసినట్టు తెలుస్తోంది. అయితే దీనిపై డీసీసీబీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అభ్యంతరం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాజకీయ పార్టీల నేతల కార్యక్రమాలు, సమావేశాలకు అనుమతి ఇవ్వొద్దని స్పష్టంగా ఆదేశాలు జారీచేసిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఈ అంశం తెలుగుదేశం వర్సెస్ వైసీపీ అన్నట్టు మారింది.

● 1999 నుంచి ఇప్పటివరకూ వరకూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా డీసీసీబీపై బొత్స హవా కొనసాగుతూ వచ్చింది. ఆయన అనుచరులు, మనుషులే డీసీసీబీ అధ్యక్షులుగా ఉన్నారు. అందుకే ఏటా అమ్మవారి సిరిమాను ఉత్సవాన్ని డీసీసీబీ మేడపై నుంచి తిలకించేవారు. ఇప్పుడు డీసీసీబీ అధ్యక్షుడిగా కిమిడి నాగార్జున ఉన్నారు. ఆపై కూటమి ప్రభుత్వం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అయితే తనకున్న పాత పరిచయాలతో బొత్స ఒత్తిడి తెస్తున్నా ఈసారి సఫలం కాలేదు.

పోలీసులపై దాడి

(మూడో పేజీ తరువాయి)

హెచ్చరించారు. జమ్ము గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కొంత మంది వ్యక్తులు దాడులకు పాల్పడడం, పోలీసు వాహనాలపై రాళ్లు రువ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడుల్లో ఎంత మంది ప్రమేయం ఉన్నా, ఎంతటివారినైనా ఉపేక్షించబోమని స్పష్టంచేశారు.

తిరుగుబాటును సహించేది లేదు: చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు

రాజ్యాంగ వ్యవస్థలపై తిరుగుబాటు చేస్తే సహించేదిలేదని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. సోమవారం గుర్ల పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గొడవకు కారణమైన వారిని, పోలీసులపై తిరగబడ్డ వారిని గుర్తించి అరెస్టు చేస్తున్నామన్నారు. ఇప్పటికే సర్పంచ్‌తో పాటు మరో 24 మందిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. పోలీసులపై దాడిచేస్తే ఎంతటివారినైనా వదలిపెట్టేది లేదన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ నారాయణరావు ఉన్నారు.

రాజాంలో భారీ వర్షం



ప్రధాన రహదారిలో ప్రవహిస్తున్న మురుగు

రాజాం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాజాంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. గొల్లవీధి, చాకలివీధి, రెల్లివీధి, మెంటిపేట ఎస్సీ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాలలో మురుగునీటి నిల్వలు పేరుకుపోయాయి. మెయిన్‌రోడ్డు మీదుగా మురుగునీరు ప్రవహించడంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. శ్రీకాకుళం రోడ్డులో ఒకటిన్నర కిలోమీటర్ మేర మురుగునీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రేషన్ బియ్యంతో వంట

● చాలీచాలని కూరతోనే విద్యార్థులకు భోజనం
● జ్యోతీబా పూలే పాఠశాలలో ఇదీ దుస్థితి





సన్న బియ్యం ఉన్నా రేషన్ బియ్యం వాడుతున్న దృశ్యం... విద్యార్థుల తాగునీటి కుళాయిలు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కలవరాయి, కోమటిపల్లి మధ్యలోని మహాత్మా జ్యోతీబా పూలే పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రాప్తికి ఆహారం పెట్టడంలేదు. విద్యార్థులు అర్ధాకలితో ఉంటే పరిస్థితులు దాపురించాయి. సోమవారం పాఠశాలను విలేకరులు సందర్శించడంతో ఈ విషయం బహిర్గతమైంది. పాఠశాలలో 280 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తూ వసతిగృహంలో ఉంటున్నారు. వీరికి ప్రభుత్వం సన్న బియ్యంతో కూడిన అన్నం, కూర, చారు, మజ్జిగ తదితర వాటిని మెనూ ప్రాప్తి అందించాల్సి ఉంది. అయితే ఇక్కడి పాఠశాలలో సన్నబియ్యానికి బదులుగా రేషన్ బియ్యాన్ని వండి వార్చుతున్నారు. అదే అన్నాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్నారు. అలాగే 280 మంది విద్యార్థులకు సుమారు 7 ఆనపకాయలతో కూర వండి సర్దుబాటు చేశారు. వాటర్ ట్యాంకుల్లో నీటిని తాగాల్సి వస్తోంది. కొద్ది రోజులుగా రేషన్ బియ్యాన్నే వండి వడ్డిస్తున్నామని వంట మనుషులు చెబుతుండగా, ప్రిన్సిపాల్ మాత్రం రెండింటినీ కలిపి పిల్లలకు వడ్డిస్తున్నామని చెప్పారు. ఈ కూర విషయం అడిగితే, మళ్లీ రాత్రికి వండుతామని ప్రిన్సిపాల్ బదులిచ్చారు. చాలీచాలని కూరగాయలను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్, రేషన్ బియ్యంతో విద్యార్థుల పొట్ట నింపుతోన్న ప్రిన్సిపాల్‌పై విచారణ జరపాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ● ఈ విషయంపై ఎంఈవో గొట్టాపు వాసుదేవరావు వివరణ కోరగా మంగళవారం పాఠశాలను సందర్శించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం



అలజంగిలో పాల్గొన్న సీడీపీవో విజయలక్ష్మి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. సోమవారం అలజంగి, మెట్టవలస గ్రామాల్లో పోషణ్ మహా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తరచూ పంపించే బాధ్యతను తల్లులు తీసుకోవాలన్నారు. పిల్లలు ఏమి నేర్చుకుంటున్నారో తల్లి దండ్రులు పరిశీలించాలని సూచించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్టర్ సూపర్‌వైజర్లు పద్మావతి, సుబ్బలక్ష్మి, ప్రభావతి, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, అరుణ, జయలక్ష్మి, శకుంతల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకపోతే పోరుబాట



నినాదాలు చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

రామభద్రపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే పరిష్కరించాలని ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు జేసి రాజు, మండల నాయకులు బి.రవికుమార్, కృష్ణంనాయుడు, శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నాకు వెళ్తున్న నాయకులకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సోమవారం వారు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జేసి రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఉపాధ్యాయులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయడానికి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. లేకుంటే పోరుబాట ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు కర్రి శ్రీనివాసరావు, గేదెల మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శంకరరావు

రామభద్రపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పొట్నూరు శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం వీఆర్‌ఏలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వ మాదిరిగా వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నామినల్‌గా పనిచేసిన వారందరిని రెగ్యులర్ చేయాలన్నారు. నైట్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. జీతంలో కలిపి డీఏను ఇవ్వాలని కోరారు. వీఆర్‌ఏ సమస్యలపై ఈ నెల 13, 14, 15 తేదీల్లో విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించనున్నామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మె చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం గౌరవ అధ్యక్షుడు బి.సూర్యనారాయణ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బలసా శ్రీను, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోండి

గరివిడి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఐసీడీఎస్ గరివిడి పీవో ఎస్.ఆరుద్ర అన్నారు. సోమవారం నడిపేనపేటలో నిర్వహించిన రాష్ట్ర పోషణ మహా కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివించాలని కోరారు. సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలి, వర్షానికి తెగిపడిన విద్యుత్ తీగలు



గొల్లపల్లి పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు

బొబ్బిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, కురిసిన వర్షానికి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. గొల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే లైన్‌లో విద్యుత్ తీగలు పొలాల్లో తెగిపడ్డాయి. దీనితో గొల్లపల్లి ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నామని ఏఈ సాంబశివరావు తెలిపారు.

పంట నమోదు చేయించుకోండి

రామభద్రపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతు సేవాకేంద్రాల్లో ఈ నెల 25లోగా పంట నమోదు (ఈ-క్రాప్) చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ ఎం.మధుసూదనరావు కోరారు. సోమవారం ఆయన మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ-క్రాప్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పంట విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. వడ్డీలేని రుణాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే పరిహారం అందుతుందని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమరా శివ, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

నిర్వహణ లేక... సాగునీరు అందక



తోటపల్లి కాలువ గుర్రపుడెక్కతో నిండిన దృశ్యం

బొబ్బిలి రూరల్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిరిడి శివారున తోటపల్లి ప్రధాన కాలువ గుర్రపు డెక్క, పూడికలతో నిండి అధ్వానంగా ఉంది. దీంతో ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందడంలేదు. ఈ కాలువ పరిధిలో సుమారు 1500 ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువలో పూడికలు, గుర్రపు డెక్క తొలగించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన చర్యలు శూన్యమని రైతులు ఆవేదన చెందుతున్నారు. ●ఈ విషయంపై తోటపల్లి కాలువ డీఈఈ కుమార్‌ని వివరణ కోరగా, కాలువను పరిశీలించి గుర్రపు డెక్కని తొలగించే ఏర్పాటు చేస్తామన్నారు.

విజయనగరం ప్లాస్టిక్ రహితంగా మారాలి

● పారిశుధ్య కార్మికుల సేవలు అపూర్వం
● జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విజయనగరం ప్లాస్టిక్ రహితంగా మారాలని, అప్పుడే ప్రజలు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే పరిసరాల శుభ్రత గురించి నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం రాత్రి జరిగిన స్వచ్ఛాంధ్ర - 2025 జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 48 మంది వ్యక్తులు, సంస్థలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండటంలో పారిశుధ్య కార్మికుల పాత్ర చాలా కీలకమని, తమ ఆరోగ్యాన్ని పక్కన పెట్టి ప్రజలకు సేవలందిస్తున్నారని చెప్పారు. విజయనగరాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చాలన్నారు. అనంతరం ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కలెక్టర్ రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 15 విభాగాల్లో 48 మంది అవార్డులు గెలుచుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, మార్కెఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అంతరిక్ష వారోత్సవాలు

బొబ్బిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజా ఆర్ఎస్ఆర్‌కె రంగారావు కళాశాలలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా పలు వైజ్ఞానిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.వీరేంద్రకుమార్ తెలిపారు. సోమవారం ఆయన కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. శ్రీహరికోట సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో స్పేస్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ ఏడాది ఎస్‌డీఎస్‌సీ షార్ ఏపీ, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలలో ఎంపిక చేసిన ఆరు కేంద్రాలలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. బొబ్బిలి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతాల విద్యార్థులు, ప్రజలకు అంతరిక్ష సాంకేతికతల ప్రయోజనాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా క్విజ్, డ్రాయింగ్, సైన్స్ ఫెయిర్, పోస్టర్ ప్రజంటేషన్స్, వాక్ ఫర్ స్పేస్ వీక్, సీనియర్ ఇస్రో శాస్త్రవేత్తలతో చర్చలు, స్పేస్ ఆన్ వీల్స్, వీడియో ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రజలు, విద్యార్థులు ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ వీరేంద్రకుమార్ పిలుపునిచ్చారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ డా.శశిభూషణరావు

బొబ్బిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య బీమాతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అత్యవసర సేవలను వినియోగించుకునే వారు జీఎస్టీ భారీగా తగ్గిన విషయాన్ని గమనించాలని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గేదెల శశిభూషణరావు అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో సోమవారం జీఎస్టీ తగ్గింపుపై ఆయన రోగులకు అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపుతో ఆసుపత్రి బిల్లులు భారీగా తగ్గినట్టు తెలిపారు. పన్నుల చెల్లింపు ప్రక్రియను సులభతరం చేయడంతో ప్రజల ఆదా శక్తి పెరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌డీఎస్ సభ్యుడు రాయపరెడ్డి సుగుణశీలరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీపీ

●రామభద్రపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీ 2.0 వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ జీఎస్టీ రేట్లు తగ్గడం వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. అక్టోబరు 18 వరకు జీఎస్టీపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, ఏవో సన్యాసిరావు, ఎంఈవో తిరుమలప్రసాద్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు రాములు నాయుడు, జూనియర్ అసిస్టెంట్ చిట్టూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సొంత ఆదాయ వనరుల పెంపుపై శిక్షణ

బొబ్బిలి రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సొంత ఆదాయ వనరుల పెంపుపై రెండు రోజుల శిక్షణ ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ శంబంగి లక్ష్మి పాల్గొని శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే పన్నులు సక్రమంగా వసూలు చేయాలన్నారు. అక్రమ లే అవుట్లు ఉంటే క్రమబద్ధీకరణకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు పాల్గొన్నారు.

వన్యప్రాణులపై అవగాహన

భామిని, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ భామిని బీట్ అధికారి దాలి నాయుడు అన్నారు. సోమవారం పోలవరంలో ఆదివాసీ గిరి జనులకు అవగాహన కల్పించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- ప్రవేశ ప్రకటన

రేఖా నెం. 2874/NE 2025, Dated: 03-09-2025 ప్రకారం 2025-26 విద్యా సంవత్సరమునకు ఈ దిగువ తెలిపిన ప్రైవేటు నర్సింగ్ స్కూల్సునందు 3 Years జనరల్ నర్సింగ్ మరియు మిడ్ వైఫరీ-స్టాఫ్‌నర్స్ ట్రైనింగ్ కోర్సు (Including 6 months internship) మొదటి సంవత్సరము నందు ప్రవేశము కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తు కోరబడుతున్నవి. దరఖాస్తు కొరకు http://dme.ap.nic.in online ద్వారా కన్వీనర్ మరియు మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కొరకు Online ద్వారా తేది: 25.10.2025 వరకు దరఖాస్తు పూర్తి చేయవలెను. కన్వీనర్ కోటా సీట్ల కొరకు పూర్తి చేసిన దరఖాస్తులను తేది: 25.10.2025 లోపల సమర్పించవలెను. మరియు మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కొరకు దరఖాస్తులను తేది: 25-10-2025లోపల సమర్పించవలెను.

నెం.	శిక్షణ సంస్థ పేరు మరియు ప్రదేశము	మొత్తం సీట్లు	కన్వీనర్ సీట్లు	యాజమాన్య సీట్లు	ట్యూషన్ ఫీజు సంవత్సరమునకు ఉచిత సీట్లకు	మేనేజ్‌మెంట్ సీట్లకు ఫీజు సంవత్సరమునకు
1	వెంకటపద్మ స్కూల్ ఆఫ్ నర్సింగ్, ప్రదీప్‌నగర్ జిల్లాకోర్టు దగ్గర, విజయనగరం	60	36	24	గవర్నమెంట్ సీట్లకు 14,000/-సంవత్సరమునకు	కన్వీనర్ సీటుపై 5 రెట్లు మించకుండా

అర్హత: అభ్యర్థులు ఇంటర్మీడియట్ పాస్ మరియు తప్పనిసరిగా ఇంగ్లీష్ సబ్జెక్ట్ నందు 40% మార్కులు వచ్చి ఉండవలెను. లేదా యం.పి.హెచ్.డబ్ల్యు. (ఫిమేల్) వొకేషనల్ లేదా మరియు ఇంటర్మీడియట్‌నకు తత్సమాన గ్రూపు వారు ఎవరైనా అర్హులు. ఎ.ఎన్.ఎం.కోర్సు పాసైన అభ్యర్థులకు ఇంగ్లీష్ సబ్జెక్ట్ అవసరం లేదు.
ప్రాధాన్యత: సైన్స్ గ్రూపుల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. తదుపరి మిగిలిన గ్రూపులు వారిని పరిగణనలోకి తీసుకొనబడును.
వయస్సు: తే.31.12.2025 తేది నాటికి 17 సంవత్సరములు నిండి ఎ.ఎన్.ఎం/ యల్.హెచ్.వి. అభ్యర్థులకు వయస్సు నిబంధన లేదు.
ఫీజు: 500/- రూపాయలు గవర్నమెంట్ చలానా ద్వారా ఈ క్రింద తెలుపబడిన హెడ్ ఆఫ్ అకౌంట్‌కు జమ చేసి, దానిని అప్లికేషన్‌కు జత చేయవలెను.
హెడ్ ఆఫ్ అకౌంట్: (HOA: 0210-Medical & Public Health, 03- Medical Education Training and Research, MH-105-Allopathy, SH-81- Other Reciepts, 001- Other Reciepts)
గమనిక: ఇతర రాష్ట్రముల నుండి దరఖాస్తు చేయు అభ్యర్థులు తప్పనిసరిగా మైగ్రేషన్ సర్టిఫికేట్ జతపర్చవలెను.
మెరిట్ నిర్ధారణ: లాంగ్వేజీ కాకుండా గ్రూపు సబ్జెక్టులతో 40% మెరిట్ వచ్చి యుండవలెను. మొదటిసారిగా పాస్ అయినవారి తరువాత కంపార్టమెంట్‌లో పాస్ అయిన వారికి హెచ్చు మార్కుల ప్రాతిపదికన ప్రాధాన్యతగా తీసుకోబడును. షెడ్యూలు కులములు షెడ్యూలు తెగలు మరియు వెనుకబడిన తరగతుల వారికి 5 శాతం సడలింపు కలదు.
రిజర్వేషన్: 85 శాతం సీట్లు లోకల్ అభ్యర్థులకు కేటాయించబడును. లోకల్ అభ్యర్థులు లేనిచో ఇతరులకు కేటాయించబడును.
పూర్తి చేసిన దరఖాస్తులను కన్వీనర్ సీట్ల కొరకు తేది 25-10-2025 లోపల సమర్పించ వలెను. మరియు మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కొరకు దరఖాస్తులను తేది 25-10-2025 లోపల సమర్పించ వలెను. లోపల ధ్రువీకరించిన సర్టిఫికేట్‌లు జెరాక్స్ కాపీలు జతచేసి విజయనగరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయం పని వేళలలో సమర్పించవలెను. తపాలా వారి ఆలస్యమునకు ఈ కార్యాలయం ఎట్టి బాధ్యత వహించదు.

సం/- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి
విజయనగరం